క్లుప్తంగా

నేడు బాలల యోగా శిక్షణ తరగతులు

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని గిరింపేట నగరపాలకోన్నత పాఠశాలలో ఈ నెల 27వ తేదీ నుంచి బాలల సిద్ధ సమాధి యోగా ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు యోగాచార్యులు నరేంద్రకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. 7 నుంచి 14 ఏళ్ల లోపు బాల,బాలికలు శిక్షణ తరగతుల్లో పాల్గొనవచ్చన్నారు. ఈ శిక్షణ ఈ నెల 27 నుంచి వరుసగా పది రోజులు కొనసాగుతాయన్నారు. అలాగే ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు 14 ఏళ్ల వయసు పైబడిన వారికి శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణ 14 రోజుల పాటు నిర్వహిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు 82476 09140, 70138 84371ను సంప్రదించాలని కోరారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న ఎంపీడీవో కుమార్

గుడిపాల: ఉపాధి హామీ పనులను ఎంపీడీవో కుమార్ శనివారం పరిశీలించారు. పశుమందలో కూలిపనులు చేస్తున్న వారి వద్దకు వెళ్లారు. గిట్టుబాటు కూలి వస్తుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. వేసవిలో పనులు చేస్తున్న నేపథ్యంలో అందరికీ ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. వేసవి నేపథ్యంలో పనులు చేసే సమయంలో నీరసం రాకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఆయనతో టెక్నికల్ అసిస్టెంట్ సుందరయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తువాళ్లూరులో గంగమ్మ కుంభాభిషేకం



ముస్తాబవుతున్న గంగమ్మ ఆలయం

గుడిపాల: మండలంలోని ముత్తువాళ్లూరు గ్రామంలో ఈ నెల 29, 30 తేదీల్లో గంగమ్మ కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 29న ఉదయం 10:30 గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, గోపూజ, భూతశుద్ధి, మహాగణపతి కలశపూజ, నవగ్రహ పూజ, గణపతి, నవగ్రహ హోమం నిర్వహించడంతోపాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. 30వ తేదీ కుంభకలశం ప్రదక్షిణం, గంగమ్మ వారికి మహాకుంభాభిషేకం, మహా అభిషేకం, ప్రత్యేక అలంకారం, అష్టోత్తర నామార్చనలు జరుగుతుందన్నారు. మధ్యాహ్నం వచ్చిన భక్తులందరికీ అన్నదానం ఉంటుందన్నారు. మే1 నుంచి మండలాభిషేకం ఉంటుందని చెప్పారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గిరింపేట సెక్షన్ జంగాలపల్లెలో నూతన 100 కేవీ సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ఏర్పాటు చేశారు. ఏర్పాటు పనులను డీఈ ప్రసాద్, ఏఈ వివేకానందరెడ్డి పర్యవేక్షించారు. నగరంలో అధిక లోడ్ ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు డీఈ ప్రసాద్ తెలిపారు. దశలవారీగా నగరంలోని నాలుగు సెక్షన్లలో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు



చిత్తూరు కార్పొరేషన్: కశ్మీర్ ఘటన నేపథ్యంలో రైల్వేస్టేషన్‌లో శనివారం తనిఖీలు చేశారు. ప్లాట్‌ఫామ్స్, వెయిటింగ్‌హాల్, బుకింగ్, రిజర్వేషన్, పార్శిల్ కౌంటర్లను పరిశీలించారు. రైల్వే, స్థానిక పోలీసులు, బాంబ్‌స్క్వాడ్ సంయుక్త ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల బ్యాగులు, ఇతర వస్తువులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ సీఐ కుమార్, రైల్వే ఎస్ఐ ప్రవీణ్ పాల్గొన్నారు.

మళ్లీ గజ దాడులు

- అటవీ అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దం
- రైతుల పాలిట శాపంగా మారుతున్న ఏనుగులు
- గజరాజుల కట్టడికి చర్యలు శూన్యం
- భయాందోళనల్లో యాదమరి వాసులు



ఏనుగుదాడిలో ధ్వంసమైన నీటి బోరు (ఫైల్)

యాదమరి: అటవీ అధికారుల నిర్లక్ష్య ధోరణి గజరాజుల పాలిట వరంగా మారుతోంది. ఏనుగుల నియంత్రణకు వేసిన ప్రణాళికలను తుత్తునియలు చేస్తూ మండలంలోకి మళ్లీ ఏనుగులు చొరబడ్డాయి. దీంతో రైతులకు ఏనుగుల బెడద మళ్లీ మొదలైంది. సరిగ్గా నెలరోజుల క్రితం 24 మంది ట్రాకర్స్ రాచూరు, బోడబండ్ల అటవీ బీట్ పరిధిలో సంచరిస్తున్న ఏనుగులను పలమనేరు అటవీ ప్రాంతంలోకి మళ్లించారు. అయితే స్థానిక వాతావరణానికి అలవాటుపడిన ఏనుగులు, ఇక్కడ లభిస్తున్న రుచికరమైన ఆహార, నీటి వనరులు పుష్కలంగా ఉండడంతో తిరోగమనం అయిన కొద్దిరోజులకే నుంజర్ల ప్రాజెక్టు సమీపానికి మళ్లీ వచ్చాయి. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు చేతికొచ్చే సమయానికి ఇలా ఏనుగులు తొక్కి నాశనం చేస్తుండడంతో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయి.

అటవీ అధికారుల ఉత్తుత్తి హామీలు

ఏనుగుల దాడుల నుంచి తమను, తమ పంటలను రక్షించాలని బాధిత రైతులు స్థానికంగా ఉన్న నాయకులతో పలుమార్లు అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఏనుగుల బెడద నుంచి శాశ్వత పరిష్కారం చూపమని గత నెలలో జిల్లా అటవీ శాఖాధికారికి బాధిత రైతులు వినతిపత్రం అందజేశారు. వారి మన్ననను స్వీకరించిన డీఎఫ్ఓ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఏనుగులు నియంత్రణకు పటిష్టమైన సోలార్ కంచె, కందకాలు తవ్విస్తామని త్వరలోనే పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కానీ సంబంధిత అధికారుల హామీలు ప్రకటనలు కాగితాలకే పరిమితమవుతుంది.

అందని ద్రాక్షగా పరిహారం

గజదాడులతో తీవ్రంగా నష్టపోయిన రైతులు.. ఆరుగాలం కష్టపడి తమ పంటలకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందిస్తామని ఊదరగొట్టిన సంబంధిత అధికారులు కాగితాలకే పరిమితమవుతున్నారు. దీనిపై రైతులు అటవీ అధికారులను ప్రశ్నిస్తే ఇదో వచ్చేస్తోంది అదో మీ బ్యాంకు ఖాతాలలో పడిపోయింది అని బీట్ అధికారి నిర్లక్ష్యపు మాటలు చెబుతుండడంతో బాధితులు దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు. పరిహారం కోసం సంబంధిత కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు చేస్తున్న ఫలితం శూన్యం. యాభై రోజుల కిందట దళవాయిపల్లెకు చెందిన నిరుపేద రైతు కుటుంబానికి చెందిన ఉమాపతి ఒంటరి ఏనుగు దాడిలో తీవ్రంగా గాయపడి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. చికిత్స నిమిత్తం రూ.లక్షలాది రూపాయలు అప్పులు చేశారు. అయినా కూడా ఇప్పటివరకూ చికిత్సకు నష్టపరిహారం అందలేదు. దీంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆ పేద కుటుంబం నానా అగచాట్లు పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అటవీ అధికారులు స్పందించి బాధిత రైతులకు నష్టపరిహారం అందించి, ఏనుగుల నియంత్రణకు తగు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంట (ఫైల్)

వినూత్నం



ద్విచక్ర వాహనాలు ఉపయోగించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలని చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కోరారు. హెల్మెట్ వాడకంపై ప్రజల్ని చైతన్యం చేయడంలో భాగంగా శనివారం ట్రాఫిక్ హోంగార్డులు టెడ్డీబేర్ దుస్తులు ధరించి నగరంలోని పలు ప్రధాన కూడళ్ల ల్లో హెల్మెట్ ధరించిన వాహనదారులను ఆపి, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. –చిత్తూరు అర్బన్

మార్కెట్ కమిటీ ఏర్పాటుకు మళ్లీ ప్రతిపాదనలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలోని నగరి, ఎస్ఆర్‌పురం(శ్రీరంగరాజుపురం) మార్కెట్ కమిటీకి ఏర్పాటుకు సంబంధించి శనివారం మళ్లీ ప్రతిపాదనలు వెళ్లాయి. ఇటీవల ఈ రెండు మార్కెట్ కమిటీలకు సంబంధించి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదని రాష్ట్ర శాఖ ప్రతిపాదనలను వెనక్కు పంపింది. దీంతో అధికారులు మళ్లీ వాటిని సరిదిద్ది పంపించారు. వారం రోజుల్లో ఈ రెండు కమిటీలను ప్రకటించే అవకాశాలున్నాయి.

నగరాన్ని శుభ్రంగా ఉంచుదాం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరాన్ని పచ్చదనంగా, పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం తడి–పొడి చెత్త సేకరణ, ప్లాస్టిక్ నియంత్రణ, వ్యర్థాల నిర్వహణపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మెరుగైన పారిశుధ్య సేవలు అందించాలంటే, ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరణ వంద శాతం జరగాలన్నారు. వీధుల్లో చెత్త ఎక్కడా కూడా ఉండొద్దన్నారు. ప్రతి వీధిలో చెత్త సేకరణ వాహనాలు ఏ సమయానికి వస్తాయన్న విషయాన్ని స్థానికంగా బోర్డుల్లో తెలియజేయడంతో పాటు ఆయా ఇన్‌చార్జ్ అధికారుల ఫోన్ నంబర్లను ప్రచురించాలన్నారు. ఈ సమావేశంలో ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్

రైతులు పాడి పంటను కాపాడుకోవాలి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రైతులు పాడి పంటను కాపాడుకోవాలంటూ, ఆర్థికవృద్ధికి బాటలు వేసుకోవాలని ఏపీఎల్‌డీఏ శ్రీనివాసరావు అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో శనివారం వరల్డ్ వెటర్నరీ డేను ఘనంగా నిర్వహించారు. తొలుత శాఖ అధికారులు, సిబ్బంది పలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులు మానవ జీవితంలో భాగమేనన్నారు. పశువుల వల్ల ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అలాంటి సంపదను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ముఖ్యంగా వాటి ఆరోగ్య విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అధికారులు సీజనల్ వారీగా పశువులకు వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. పశువైద్య సేవలను మెరుగ్గా అందించాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం పశు సంతతి పరిశీలన పథక శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది మునిరాజమ్మ, గోవిందస్వామి నాయుడు, శ్రీనివాసులు నాయుడు, రైతులు ఆరుముగం, హరి, వెంకటరెడ్డిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి అరిఫ్, పశు సంతతి పరిశీలన పథక డీడీ వాసు పాల్గొన్నారు.



రైతును సన్మానిస్తున్న అధికారులు

ఉగ్రదాడి హేయమైన చర్య

చిత్తూరు కలెక్టరేట్ : జమ్మూ కశ్మీర్ ఉగ్రదాడి హేయమైన చర్య అని జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రాఘవులు అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద శనివారం మాజీ సైనిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేసి మృతులకు నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ మతాల పేరుతో దాడులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనిక సంక్షేమ సంఘం నాయకులు పళని, సురేంద్ర, భారతి తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన చేపడుతున్న మాజీ సైనికులు

బందోబస్తు విషయంలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న ఈవో పెంచల కిషోర్

కాణిపాకం: ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో ఆలయంలో పటిష్ట బందోబస్తు కల్పించాలని ఈవో పెంచల కిషోర్ ఆదేశించారు. కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన పరిధిలో ఆయన శనివారం హోంగార్డులు, సెక్యూరిటీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులను చెకింగ్ పాయింట్ల వద్ద క్షుణంగా పరిశీలించాలన్నారు. రాత్రి పూట అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎవరైనా అనుమానంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఏఈవో రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి తదితరులున్నారు.

యువకుడిపై కత్తితో దాడి

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని రాజేష్ అనే యువకుడిపై ఇద్దరు వ్యక్తులు శనివారం కత్తితో దాడికి పాల్పడ్డారు. చామంతి పురానికి చెందిన మనోజ్ పాత కలెక్టరేట్ కూడలిలో ఉండగా, అదే కాలనీకి చెందిన మణితేజ, చంద్ర కత్తితో దాడి చేసి గాయపరిచారు. ఆటో నడుపుతున్న ఈ ముగ్గురి మధ్య పాత కక్షలు ఈ గొడవకు కారణంగా పోలీసులు భావిస్తున్నారు. ఘటనపై టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విత్తనాలకు ప్రతిపాదనలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): వేరుశనగ విత్తనాలకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు శ్రీకాళహస్తీలోని విత్తనకాయల సరఫరా కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. కే6 రకం విత్తనాలు 36,566 క్వింటాళ్లు, నారాయణి 1,521 క్వింటాళ్లు, టీసీజీఎస్ 1694 రకం 2,252 క్వింటాళ్లు కావాలని నివేదికలు పంపారు. ఈ మేరకు మే నెలలో కేంద్రం నుంచి జిల్లాకు వేరుశనగ విత్తనాలు సరఫరా కానున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మే 15వ తేదీ నుంచి రైతులకు విత్తన కాయలు పంపిణీ చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

వెంకటాపురంలో భూ వివాదం



వివాదాస్పద స్థలంలో కూల్చేసిన బోర్డు

చిత్తూరు రూరల్(కాణిపాకం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూ సమస్యలు చిచ్చురేపుతున్నాయి. నగరంలోని బండపల్లి రెవెన్యూలో ఉన్న 194 వెంకటాపురంలో మళ్లీ భూ సమస్య వివాదాస్పదంగా మారింది. రెండు రోజుల క్రితం ఓ వర్గం హైకోర్టులో భూమి తమకు సొంతమైనట్లు బోర్డు పెట్టింది. పెట్టిన రెండు రోజులకే బోర్డును మరోవర్గం కూలగొట్టింది. ఈ భూ వివాదం ఇప్పుడు తారాస్థాయికి చేరింది. అయితే రెవెన్యూ అధికారులు మాత్రం ఈ విషయంలో ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. గతంలో దాన్ని ప్రభుత్వ భూమిగా గుర్తించిన అధికారులు ఇప్పుడు మిన్నకుండిపోవడంపై విమర్శలకు తావిస్తోంది. దీనిపై తహసీల్దార్ లోకేశ్వరిని వివరణ కోరగా, ఏ భూమిలో అయినా అలా బోర్డు పెట్టకూడదని, అది ప్రభుత్వ స్థలమా లేక ప్రైవేటు వ్యక్తులకు చెందినదా? ఇపుడే చెప్పలేమని, క్షేత్రస్థాయిలో విచారించి ఆ భూమి ఎవరిది అనేది నిర్ధారిస్తామని పేర్కొన్నారు.

గర్భిణులు ఆస్పత్రిలోనే ప్రసవించాలి

తవణంపల్లె: గర్భిణులు ఆస్పత్రిలో ప్రసవించడం తల్లీబిడ్డకు క్షేమమని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మండలంలోని పుణ్యసముద్రంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ కేశవనారాయణ 34 మంది రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. గర్భవతులు 104, 108 వాహనాల సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం, తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు వాడాలని చెప్పారు. ఎండల్లో బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



పుణ్యసముద్రంలో గర్భవతిని పరీక్షిస్తున్న డాక్టర్ కేశవనారాయణ

ఎట్టకేలకు బోర్డుల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో మార్కెట్ గేటు రుసుముల వసూళ్లపై జరుగుతున్న బలవంతపు వసూళ్లకు సంబంధించి ‘సాక్షి’ పత్రికలో ప్రచురితమైన కథనాలు వాస్తవమేనని అధికారులు ఎట్టకేలకు అంగీకరించారు. రైతులు, చిన్నపాటి వ్యాపారుల నుంచి మార్కెట్ గేటు వసూలు చేయాల్సిందానికన్నా, ఎక్కువ మొత్తంలో దోచుకుంటున్న వైనంపై ఈనెల 22న ‘సాక్షి’ పత్రికలో ‘గేటు జలగలు’ శీర్షికన కథనం ప్రచురితమైంది. తాటి ముంజెలు, కొబ్బరి బోండాలు అమ్ముకుంటున్న వాళ్ల నుంచి రోజుకు రూ.50 వసూలు చేయడం, చిన్న వ్యాపారుల నుంచి రూ.30, లారీలకు రూ.500 నుంచి రూ.2 వేలు వరకు వసూలు చేయడంపై ఇందులో ప్రచురితమయ్యాయి. ఇంత జరుగుతున్నా అధికారులు గేటు వసూలు రుసుములు బహిర్గతంగా తెలియచేయకపోవడాన్ని ప్రశ్నించడంతో.. ఎట్టకేలకు కార్పొరేషన్ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ బోర్డులో ఏ వ్యాపారం చేసేవాళ్లు ఎంత చెల్లించాలనే వివరాలను స్పష్టంగా తెలియచేశారు. కూరగాయలు 30 కిలోల వరకు విక్రయిస్తే మార్కెట్ బయట రూ.7, 50 కిలోల వరకు రూ.10, 50 కిలోలకు పైబడితే రూ.10 చొప్పున గేటు చెల్లించాలని బోర్డులో సూచించారు. కానీ వాస్తవానికి బోర్డులో సూచించిన దానికంటే రెండింతలు అదనంగా వసూలు చేస్తున్నారు. బోర్డులో పానీపూరీ బండ్ల ప్రస్తావనే లేదు. అయినా రిక్షాపై వచ్చి వ్యాపారం చేస్తే రూ.10 చెల్లించాలని ఉంది. కానీ ఒక్కో పానీపూరి దుకాణం నుంచి రూ.30–50 వసూలు చేస్తున్నారు. పండ్లు బుట్టలో పెట్టుకుని అమ్మితే రూ.5 వసూలు చేయాల్సి ఉంటే.. రూ.30–50 వసూలు చేస్తున్నారు. ఆక కూరలు ఒక పెద్ద కట్టకు రూ.10 చెల్లించాల్సి ఉండగా.. రూ.30 వసూలు చేస్తున్నారు. అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులో అన్ని వివరాలు నమోదు చేశారు. అధిక మొత్తంలో గేటు వసూలు చేస్తే ప్రశ్నించాల్సిన బాధ్యత వ్యాపారులు, రైతులపైనే ఉంది. కాదని దౌర్జన్యం చేస్తే పోలీసులకు, మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.



గేటు ఎంత వసూలు చేయాలని అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

కాడెద్దులు కరువై.. సేద్యం బరువై!



గతంలో కాడెద్దులతో నాగలి దున్నుతున్న రైతు (ఫైల్)

గుడిపాల: రైతన్నలకు ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా నిలిచేది పశుసంపద. ఆరుగాలం సేద్యం పనుల్లో వెన్నంటే ఉంటూ అన్నదాతకు తోడుగా నిలబడేవి పశువులు. గతంలో ప్రతి ఇంటా దేశవాళీ, సంకరజాతి ఆవులు కళకళలాడుతూ ఉండేవి. అలాగే ప్రతి ఇంటా పాలు, పెరుగు పుష్కలంగా ఉంటూ కొంత ఆర్థిక పరిపుష్టి చేకూర్చేవి. ఇదంతా గతానికే పరిమితం కాగా ప్రస్తుతం పరిస్థితులు తారుమారయ్యాయి. ప్రస్తుతం కాడెద్దులు కానరాక పల్లెల్లో సేద్యపు పనులు కుంటుపడిపోయాయి. పశువులను మేపడానికి మేత లేక వాటిని కబేళాలకు తరలించాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో చిత్తూరు నియోజకవర్గంలో సుమారు 23వేల వరకు ఆవులు ఉండేవి. ప్రస్తుతం ఆ సంఖ్య 16వేలకు చేరింది. సేద్యం చేసుకోవడానికి పశువుల స్థానంలో యంత్రాలు రావడంతో అన్నదాతలంతా పశుసంపదను కోల్పోతున్నారు. ట్రాక్టర్లతో పాటు పలు యంత్రాలు రావడంతో పశువులు, కూలీలతో అవసరం లేకుండా పోయింది. ఒకప్పుడు గ్రామాల్లో పశువులను పెంచడం పెద్దరికంగా భావించేవారు. ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా తయారయ్యాయి. ప్రతి ఇంట్లోనూ ఎద్దులు, జాతి పశువులు అధికంగా ఉండేవి. ప్రస్తుతం కొంతమంది మాత్రమే పాల దిగుబడి కోసం పెంచుకుంటున్నారు.



దుక్కి చేస్తున్న ట్రాక్టర్

వ్యవసాయంపై ప్రభావం

తరిగిపోతున్న పశుసంపద వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పశువుల పేడను పంటలకు వేస్తే అధిక దిగుబడి వచ్చేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకుండా పోతుంది. ఎక్కడ కూడా పశువులపేడ, ఎరువులు చిక్కని పరిస్థితి దాపురించింది. దీంతో సేంద్రియ ఎరువులు తీవ్రంగా కొరత ఏర్పడడంతో రసాయనిక ఎరువులను కొనక తప్పడం లేదని రైతులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పశువులు లేక దుక్కులు దున్నడానికి రైతులంతా ట్రాక్టర్లను ఆశ్రయించాల్సి వస్తుందని, డీజిల్ అధికం కావడంతో బాడుగలు కట్టలేక రైతులు గగ్గోలు పెడుతున్నారు.